TG TEL/25/A1234

www.kakatiyanews.com

# ఉత్తరం కాకతీయ

మంగళవారం, 08 సెప్టెంబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 24 | పేజీలు: 6 వెల: 5




## విద్య వ్యవస్థను రేవంత్ దెబ్బతీస్తున్నాడు

### మొన్న ఇంటర్ రద్దు అన్నాడు..

- ఇప్పుడు పాలిటెక్నిక్‌ను ప్రమాదంలోకి నెట్టాడు
- రూ.13 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి
- నెలనెలా బకాయిలు చెల్లిస్తామని సభలో మాట ఇచ్చి సీఎం తప్పారు
- పేద విద్యార్థులు, ఆడబిడ్డలను చదువుకు దూరం చేయొద్దు
- గ్రేటర్ వరంగల్ నుంచే టీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభిస్తాం
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

**కాకతీయ, హన్మకొండ:** విద్యా వ్యవస్థను సీఎం రేవంత్‌రెడ్డి దెబ్బతీస్తున్నారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.13 వేల కోట్లకు పైగా పేరుకుపోయినా పట్టించుకోవడం లేదని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించడంతోపాటు టైంబాండ్ నిర్దేశించుకొని నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలను ఆగం చేసే హక్కు ఈ ప్రభుత్వానికి ఎక్కడిదని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపును డిమాండ్ చేస్తూ హన్మకొండలో కవిత ఫీజు పోరు యాత్ర చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం అక్కడి నుంచి సుమారు 3 కి.మీ. దూరంలోని హన్మకొండ కలెక్టరేట్ వరకు వేలాది మంది విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. నడిఎండను సైతం లెక్కచేయకుండా 45 నిమిషాల పాటు ర్యాలీలో పాల్గొన్నారు.

........(తరువాయి 2లో)



# తొలిరోజే రణరంగం

## అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ ఎస్ నిరసన

- నల్ల టీషర్టులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ర్యాలీ
- గేటు వద్దే పోలీసులతో వాగ్వాదం.. తోపులాట
- కేటీఆర్‌ను ఎత్తుకుని వాహనంలోకి ఎక్కించిన పోలీసులు
- టీషర్టు విప్పేసిన హరీశ్‌రావు..
- పలువురు నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- సునీతా లక్ష్మారెడ్డి చీర లాగారని బీఆర్ఎస్ ఆరోపణ
- నెల రోజుల పాటు సభ నిర్వహించాలన్న కేటీఆర్
- అసెంబ్లీ ప్రాంగణంలో రోజంతా హై టెన్షన్



**కాకతీయ,తెలంగాణ బ్యూరో:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలిరోజే రాజకీయ వేడి తారస్థాయికి చేరింది. సభ లోపలికి అడుగుపెట్టకముందే అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య పోరాట వాతావరణం కనిపించింది. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల టీషర్టులతో అసెంబ్లీకి రావడం.. వాటిపై ఉన్న నినాదాలను పోలీసులు అభ్యంతరం చెప్పడం.. ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాటకు దారితీయడం చకచకా జరిగిపోయాయి. అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలు చూస్తే.. ఈసారి సమావేశాలు ప్రశాంతంగా సాగడం అంత సులువు కాదన్న సంకేతాలు తొలిరోజే స్పష్టమయ్యాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి చేరుకున్నారు. ప్రభుత్వంపై నిరసన తెలిపేందుకు ఆ పార్టీ ముందుగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.

........(తరువాయి 2లో)



## ఇదేం అసెంబ్లీ.. కౌరవ సభా..
## పోలీసు రాజ్యమా?

### మహిళా శాసనసభ్యుల చీరెలు లాగుతారా..

- ఎమ్మెల్యేల మెడలు పట్టి గెంటేస్తారా?
- ప్రజాప్రతినిధులపై పోలీసులను ప్రయోగించడం దుర్మార్గం
- బీఆర్ఎస్ లేకుండా సభ నడపడం ప్రజాస్వామ్యమా?
- 22ఏ, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చర్చకు ప్రభుత్వం ఎందుకు భయపడుతోంది?
- ఎన్ని కుట్రలు చేసినా ప్రజల సమస్యలపై పోరాటం ఆపం
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్షం ఉపనేత హరీశ్‌రావు

2



## ఎస్ఐఆర్ గడువు పొడిగింపు.. ఓటర్లకు ఊరట

- క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు అక్టోబర్ 7 వరకు అవకాశం
- నవంబర్ 9న తుది ఓటరు జాబితా
- 47.79 లక్షల మందికి నోటీసులు.. 32 లక్షల మంది నుంచి స్పందన లేదు
- ఎన్నికల ప్రక్రియలో మరింత సమయం అవసరం



2

## కనీసం 15 రోజులు అసెంబ్లీ నడపాలి

- 22ఏ, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై స్వల్పకాలిక చర్చలు చేపట్టాలి
- ప్రజా సమస్యలు ఎన్నో ఉన్నాయి.. 20-30 రోజులు సభ నిర్వహించాలి
- అవసరమైతే ఎన్నిరోజులైనా సమావేశాలకు ప్రభుత్వం సిద్ధం
- బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి




2

# స్పీకర్‌కు అవమానం..

## ఇలాంటి భాష గతంలో ఎప్పుడూ చూడలేదు

- ఇలాంటి భాష వాడిన సభ్యుడిని డిస్మిస్ చేయాలి
- సభాపతిని అవమానించడం చట్టసభనే అవమానించినట్లే
- తాతా మధు వ్యాఖ్యలకు కేసీఆర్ బాధ్యత వహించి క్షమాపణ చెప్పాలి : సీఎం రేవంత్‌రెడ్డి



**కాకతీయ, హైదరాబాద్:** స్వతంత్ర భారతంలో సభాపతికి ఇలాంటి అవమానం గతంలో ఎప్పుడూ జరగలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ సభలో జరిగిన చర్చ సందర్భంగా సీఎం తీవ్రంగా స్పందించారు. తాను అన్ని సభలను చూశానని, కానీ ఇంత అభ్యంతరకరమైన భాషను ఎప్పుడూ చూడలేదన్నారు. ఇలాంటి వాటిని క్షమిస్తే చట్టసభలకు గౌరవం, మర్యాద ఉండదని స్పష్టం చేశారు. సభాపతికి జరిగిన అవమానం సభకు జరిగిన అవమానంగానే భావించాలని రేవంత్‌రెడ్డి అన్నారు. అసభ్యకర భాషను ఉపయోగించిన సభ్యుడిని డిస్మిస్ చేయాలని, ఆ సభ్యుడితో కేసీఆర్ రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు.

**పథకం ప్రకారమే స్పీకర్‌ను అవమానించారు**

స్పీకర్‌కు అవమానం జరిగిన రోజును తెలంగాణకు చీకటి రోజుగా, నాలుగు కోట్ల ప్రజలకు అవమానం

........(తరువాయి 2లో)



## నీటి కష్టాలకు కేసీఆర్ వైఫల్యాలే కారణం

- రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినా ప్రాజెక్టులు పూర్తి చేయలేదు
- పాలమూరు–రంగారెడ్డిపై 90 శాతం పనులంటూ పచ్చి అబద్ధాలు
- గడిచిన 3 జల సంవత్సరాల్లో కృష్ణా న్యాయవాటాను సమర్థంగా వినియోగించాం
- కాళేశ్వరం బ్యారేజీలను శాస్త్రీయ పద్ధతుల్లో పునరుద్ధరిస్తాం
- తెలంగాణ నదీజల హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు
- నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ రైతులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న నీటి కష్టాలకు ఒకవైపు ఎల్‌నినో, మరోవైపు కేసీఆర్ వైఫల్యాలే కారణమని నీటిపారుదల,

........(తరువాయి 2లో)

## రిజిస్ట్రేషన్ ఆఫీసులో రైటర్లదే రాజ్యం

- నర్సంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అనధికార వ్యవస్థ
- కొంతమంది డాక్యుమెంట్ రైటర్ల ద్వారా వెళ్తేనే పని పూర్తి
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నేరుగా వెళ్తే రిజిస్ట్రేషన్‌కు కొర్రీలు
- డాక్యుమెంటర్ రైటర్ల ద్వారా వెళ్తే అదనంగా రిజిస్ట్రేషన్‌కు రూ.10 వేల వసూళ్లు




5



## హామీలపై కాంగ్రెస్‌ను ఎండగడతాం

- అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చి.. ప్రజలను మోసం చేసింది
- వంద రోజుల్లో 420 హామీలు అమలు చేస్తామన్నారు
- బాండ్ పేపర్లపై రాసిచ్చి.. 1,000 రోజులైనా ఒక్క హామీ నెరవేర్చలేదు
- 18 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై నిలదీస్తాం
- రైతులు, కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై సభలో ప్రశ్నిస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2

## ఆర్టీఏలో డ్రైవర్లే దందాకు అండ?

- ఆ వాహనాలు అధికారులవేనా?
- టెంపరరీ నంబర్లతో తిరుగుతున్న వాహనాలపై ప్రశ్నలు
- ప్రైవేటు వ్యక్తులే అధికారుల వెంట.. ఏఎంవీఐ డ్రైవర్ చుట్టూ వసూళ్ల వ్యవహారం
- ఇద్దరు ఏఎంవీఐలు ఉండగా మరో ఎంవీఐకి ఓడీ ఎందుకు?
- లాగిన్ లొల్లి.. వాహనాల వ్యవహారంపైనా ప్రశ్నల వర్షం




5

# తొలిరోజే రణరంగం

(మొదటిపేజీ తరువాయి)

అయితే కొన్ని టీషర్టులపై ఉన్న నినాదాలను పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వాటిని అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతించేందుకు నిరాకరించడంతో బీఆర్ఎస్ నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మొదట మాటలకే పరిమితమైన వివాదం క్రమంగా తోపులాటకు దారితీసింది. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కావడానికి ముందే ప్రధాన గేటు వద్ద ఈ పరిస్థితి నెలకొనడంతో అక్కడికి చేరుకున్న నేతలు, కార్యకర్తలు, మీడియా ప్రతినిధుల్లో ఒక్కసారిగా ఉత్కంఠ పెరిగింది. పోలీసులు పలువురు బీఆర్ఎస్ నేతలను అదుపులోకి తీసుకోవడంతో ఆ పార్టీ శిబిరంలో ఆగ్రహం వ్యక్తమైంది. సమావేశాల తొలిరోజే బయట ఇలాంటి పరిస్థితి నెలకొనడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.



**టీషర్టు విప్పేసి హరీశ్‌రావు నిరసన**

పోలీసుల తీరుకు నిరసనగా మాజీ మంత్రి హరీశ్‌రావు తన టీషర్టును విప్పేశారు. బీఆర్ఎస్ నేతల సమాచారం ప్రకారం కేపీ వివేక్, సుధీర్‌రెడ్డి కూడా టీషర్టులు తొలగించారు. అనంతరం వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద బీఆర్ఎస్ నిరసన మరింత తీవ్ర రూపం దాల్చింది. మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. అసెంబ్లీకి వెళ్తున్న సమయంలో తన చీరను పోలీసులు లాగారని ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. మహిళా ప్రజాప్రతినిధితో ఇలా వ్యవహరించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆమెను ఓదార్చారు. మహిళా ఎమ్మెల్యే పట్ల పోలీసుల ప్రవర్తనపై బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. అయితే ఈ ఆరోపణలపై పోలీసుల నుంచి పూర్తి వివరణ రావాల్సి ఉంది.

**జగదీశ్‌రెడ్డికి గాయాలు**

పోలీసులతో జరిగిన తోపులాటలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కాలికి గాయమైనట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. ఈ పరిణామంతో అసెంబ్లీ బయట ఉద్రిక్తత కొనసాగింది. ఒకవైపు నిరసన తెలిపేందుకు వచ్చిన బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకోవడం, మరోవైపు వారిని అదుపులోకి తీసుకోవడం, ఇంకోవైపు నేతలు పోలీసుల తీరును తప్పుబట్టడం.. మొత్తంగా అసెంబ్లీ ప్రాంగణం వెలుపల రాజకీయ ఘర్షణ వాతావరణాన్ని తలపించింది. పోలీసులు మాత్రం భద్రతా నిబంధనల ప్రకారమే చర్యలు తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. అసెంబ్లీ భద్రతకు ఆటంకం కలిగించే విధంగా వ్యవహరిస్తే అనుమతించబోమన్న సంకేతాన్ని ఇచ్చాయి.

## కేటీఆర్‌ను ఎత్తుకుని తీసుకెళ్లడంతో ఉద్రిక్తత

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకునే సమయంలో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. కేటీఆర్‌ను ఎత్తుకుని పోలీసు వాహనంలోకి ఎక్కించే ప్రయత్నం కనిపించింది. తనను పోలీసులు దురుసుగా వ్యవహరించారని కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, పోలీసుల తీరుపై మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి ఇంతకు ఇంతా చెల్లిస్తామని హెచ్చరించారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించకుండా అడ్డుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. కేటీఆర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుంటున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఘటన రాజకీయంగా మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. సాధారణంగా సభా సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీసే ప్రతిపక్ష వ్యూహం కనిపిస్తుంది. కానీ ఈసారి సభ ప్రారంభానికి ముందే నిరసన, అరెస్టులు, పోలీసులతో ఘర్షణ చోటుచేసుకోవడం సమావేశాలపై రాజకీయ ప్రభావం ఎలా ఉండబోతోందన్న ఆసక్తిని పెంచింది.

దీంతో ఇరుపక్షాల వాదనలు పరస్పరం భిన్నంగా కనిపించాయి.

**నెల రోజుల సభకు కేటీఆర్ డిమాండ్**

అసెంబ్లీ సమావేశాలను నెల రోజుల పాటు నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలు, పెండింగ్ హామీలపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగాలు, రైతుల సమస్యలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతోపాటు ఎన్నికల హామీల అమలుపై చర్చకు పట్టుబడతామని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. తమకు సభలో మాట్లాడేందుకు తగిన సమయం ఇవ్వాలని వారు కోరుతున్నారు. సమావేశాలు తక్కువ రోజులు మాత్రమే జరిగితే కీలక అంశాలపై పూర్తిస్థాయి చర్చ సాధ్యం కాదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు.

**తొలిరోజే స్పష్టమైన రాజకీయ సంకేతాలు**

తొలిరోజు అసెంబ్లీ వెలుపల చోటుచేసుకున్న పరిణామాలను పరిశీలిస్తే.. ఈ సమావేశాల్లో బీఆర్ఎస్ దూకుడైన వ్యూహంతో ముందుకు వెళ్లే అవకాశం స్పష్టమవుతోంది. నల్ల టీషర్టుల నిరసనతోనే ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడి పెంచే ప్రయత్నం మొదలైంది. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం భద్రత, సభా నియమాల విషయంలో వెనక్కి తగ్గే పరిస్థితిలో కనిపించడం లేదు. దీంతో అసెంబ్లీ గేటు వద్ద మొదలైన పోరు సభలోకి చేరడం ఖాయమన్న వాతావరణం తొలిరోజే కనిపించింది. ప్రజా సమస్యలపై చర్చ కంటే ముందు ప్రతిపక్ష నిరసనను ప్రభుత్వం ఎలా ఎదుర్కొంటుంది, బీఆర్ఎస్ ఏ అంశాలను ఆయుధాలుగా మలుచుకుంటుంది అన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. సమావేశాలు కొనసాగే కొద్దీ ఈ ఉద్రిక్తత మరింత రాజకీయ రూపం దాల్చే అవకాశం ఉంది.

# స్పీకర్‌కు అవమానం..

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన రోజుగా సీఎం అభివర్ణించారు. కేసీఆర్ తన ఎమ్మెల్యేలను ముందురోజు పిలిపించుకుని స్పీకర్‌పై ఉసిగొల్పారని ఆరోపించారు. ఇది అనాలోచితంగా జరిగిన చర్య కాదని, పథకం ప్రకారమే జరిగిందని అన్నారు. స్పీకర్‌ను అవమానించడం వైద్యం చేసే వైద్యుడినే గాయపరిచినట్లుగా ఉందని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ అంశంపై చర్చకు బీజేపీ సభ్యులు సహకరించాలని, స్పీకర్‌కు జరిగిన అవమానంపై చర్చ పూర్తయిన తర్వాత ఏ అంశంపైనైనా చర్చిద్దామని కోరారు. స్పీకర్‌పై తాతా మధు ఉపయోగించిన భాషను బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. అసభ్యకర భాషను ఉపయోగించిన సభ్యుడిని బర్తరఫ్ చేయాలని, తాతా మధు వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్పీకర్‌పై అత్యంత హేయమైన భాషను ఉపయోగించారని మంత్రి సీతక్క అన్నారు. ఇలాంటి సభ్యులపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తాతా మధు వ్యాఖ్యలకు కేసీఆర్ బాధ్యత వహించి క్షమాపణ చెప్పాలని కోరారు.

# ఇదేం అసెంబ్లీ.. కౌరవ సభా.. పోలీసు రాజ్యమా?

- **మహిళా ఎమ్మెల్యేల చీరెలు లాగుతారా..**
- **ఎమ్మెల్యేల మెడలు పట్టి గెంటేస్తారా?**
- **బీఆర్ఎస్ లేకుండా సభ నడపడం ప్రజాస్వామ్యమా?**
- **మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్షం ఉపనేత హరీశ్‌రావు**

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** ఇదేం అసెంబ్లీ.. కౌరవ సభా.. పోలీసు రాజ్యమా అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్షం ఉపనేత హరీశ్‌రావు ప్రశ్నించారు. మహిళా శాసనసభ్యుల చీరెలు లాగడం, ఎమ్మెల్యేల మెడలు పట్టి గెంటేయడం, ప్రజాప్రతినిధులపై పోలీసులను ప్రయోగించడం దుర్మార్గమని మండిపడ్డారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులను మాట్లాడకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. మహిళా సభ్యుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అమానుషమని హరీశ్‌రావు అన్నారు. సునితమ్మ చీర లాగిన, సబితమ్మ గొంతు నొక్కిన, జగదీష్‌రెడ్డిని కిందపడేసిన పోలీసులను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. పలువురు ఎమ్మెల్యేలు గాయపడ్డారని తెలిపారు. ఈ ఘటనలకు ముఖ్యమంత్రి, హోంమంత్రి రేవంత్‌రెడ్డి తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు.

**22ఏ, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సమాధానం చెప్పాలి**

22ఏ భూములు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా ప్రభుత్వం తప్పించుకుంటోందని హరీశ్‌రావు ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను 3 ఏళ్లుగా చెల్లించడం లేదని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి బీఆర్ఎస్‌ను సభకు దూరంగా ఉంచేందుకు కుట్ర చేశాయని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు, కుట్రలు ఎదురైనా ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రధాన ప్రతిపక్షం లేకుండా చర్చ జరపడం ప్రజాస్వామ్యం కాదన్నారు. చివరకు ప్రజాక్షేత్రంలో ప్రజలే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

# ఎస్ఐఆర్ గడువు పొడిగింపు.. ఓటర్లకు ఊరట

**కాకతీయ, హైదరాబాద్:** తెలంగాణలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును ఎన్నికల సంఘం పొడిగించింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7 వరకు అవకాశం లభించింది. నవంబర్ 9న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో గడువు పొడిగింపు ఓటర్లు, అధికారులకు కొంత ఊరటనిచ్చే అంశంగా మారింది. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం నుంచే పలు ఇబ్బందులతో సాగుతోంది. ఎన్యూమరేషన్ సమయంలో సమస్యలు తలెత్తగా, ప్రస్తుతం నోటీసుల జారీ, విచారణ ప్రక్రియలోనూ గందరగోళం కొనసాగుతోంది. బీఎల్‌వోల అవగాహన లోపం, నిర్లక్ష్యంతోపాటు ప్రజల్లోనూ సరైన అవగాహన లేకపోవడం క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణపై ప్రభావం చూపుతోంది.

**ఇంటింటికీ నోటీసులపై గందరగోళం**

ఓటర్లకు ఇంటింటికీ వెళ్లి నోటీసులు అందించాలని ఎన్నికల సంఘం ఆదేశించినప్పటికీ, కొన్ని చోట్ల బీఎల్‌వోలు నేరుగా నోటీసులు అందిస్తుండగా, మరికొన్ని చోట్ల ఫోన్ చేసి నోటీసులు తీసుకెళ్లాలని సూచిస్తున్నట్లు సమాచారం. కొన్ని ప్రాంతాల్లో భారీగా నోటీసులు జారీ చేసినా విచారణకు హాజరవుతున్న వారి సంఖ్య తక్కువగా ఉంటోంది. ఇప్పటివరకు 47.79 లక్షల మందికి నోటీసులు జారీ కాగా, సుమారు 32 లక్షల మంది నుంచి సమాధానం రాలేదని తెలుస్తోంది. దీంతో వారికి మరోసారి నోటీసులు జారీ చేస్తున్నారు. విచారణ తేదీకి వారం రోజుల ముందే నోటీసులు అందించాల్సి ఉన్నా, క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం కనిపిస్తోందనే విమర్శలు ఉన్నాయి. నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు అవసరమైన పత్రాలపై కూడా ఓటర్లకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడం సమస్యగా మారింది. తుది ఓటరు జాబితాలో పేరు కొనసాగాలంటే నోటీసులకు తప్పనిసరిగా సమాధానం ఇవ్వాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# విద్య వ్యవస్థను రేవంత్ దెబ్బతీస్తున్నాడు

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టరేట్‌కు చేరుకున్న అనంతరం విద్యార్థులను లోపలికి అనుమతించకపోవడంతో మెయిన్ గేట్ వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు.

**సభలో ఇచ్చిన హామీని సీఎం నిలబెట్టుకోవాలి**

తాను శాసనమండలి సభ్యురాలిగా ఉన్న సమయంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశాన్ని సభలో లేవనెత్తానని కవిత గుర్తుచేశారు. నెలనెలా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి సభలో హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ మాట తప్పారని మండిపడ్డారు. ఏళ్ల తరబడి బకాయిలు చెల్లించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా చిన్నచిన్న కళాశాలలు మూతపడుతున్నాయని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి చదువుకుంటున్న విద్యార్థుల పరిస్థితి దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెషనల్ కోర్సులు, డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులకు బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని తెలిపారు. మొన్న ఇంటర్మీడియట్ వ్యవస్థను రద్దు చేస్తామని చెప్పారని, ఇప్పుడు పాలిటెక్నిక్ విద్యను ప్రమాదంలోకి నెడుతున్నారని రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థుల జీవితాలు ఆగమవుతున్నాయని అన్నారు. ఫీజులు చెల్లించే స్థోమత లేక పేద తల్లిదండ్రులు ఆడపిల్లలను చదువుకు దూరం చేస్తున్నారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా ఆడపిల్లలే ఎక్కువగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలను విద్యకు దూరం చేయవద్దని కోరారు.

**కలెక్టర్‌కు విద్యార్థుల సమస్యలు వివరించా**

కలెక్టరేట్ వద్ద విద్యార్థులతో కలిసి కవిత అరగంటకు పైగా బైఠాయించారు. తమను, విద్యార్థులను కలెక్టరేట్‌లోకి అనుమతించే వరకు అక్కడి నుంచి కదిలేది లేదని



స్పష్టం చేశారు. అనంతరం పోలీసులు అనుమతించడంతో హన్మకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. కోర్సులు పూర్తయినా కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజావాణిలోనూ ఇదే సమస్యపై విద్యార్థులు వస్తున్నారని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఈ సందర్భంగా తెలిపారు. సర్టిఫికెట్లు ఇవ్వని కళాశాలల యాజమాన్యాలతో మాట్లాడి విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇప్పిస్తున్నామని చెప్పారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని కవిత కోరారు.

**వరంగల్ నుంచే పార్టీ జైత్రయాత్ర**

గ్రేటర్ వరంగల్ ఎన్నికల్లో అన్ని డివిజన్ల నుంచి టీఆర్ఎస్ పోటీ చేస్తుందని కవిత తెలిపారు. ఇక్కడి నుంచే టీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభిస్తామని అన్నారు. హన్మకొండ జిల్లా తరాలపల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరించిన సందర్భంగా ప్రజలకు మంచి చేయాలన్న గట్టి సంకల్పంతో కొత్త పార్టీ పెట్టానని చెప్పారు. మెరుగైన విద్య, వైద్యం ప్రజలకు ఉచితంగా అందించడమే తన లక్ష్యమన్నారు. సామాజిక న్యాయంతోపాటు ప్రజలకు మంచి జరగాలన్న తమ సంకల్పానికి ప్రజల ఆశీర్వాదం కావాలని కోరారు. పార్టీ నాయకులు ఎప్పుడూ ప్రజల మధ్యే ఉండి వారి తరపున పోరాడాలని సూచించారు.

అయోధ్యపురం రైతుల పరిస్థితి వనవాసానికి వెళ్లినట్లుగా ఉందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం అయోధ్యపురంలోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీని సందర్శించిన ఆమెకు నిర్వాసితులు పరిహారంలో జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. దేవాదాయ శాఖ భూములతో తమ భూములు కలిసి ఉండటంతో గతంలో డీజిల్ ఫ్యాక్టరీ కోసం భూసేకరణ చేసినప్పుడు 90 శాతం పరిహారం తమకు, 10 శాతం దేవాదాయ శాఖకు ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు ఎకరాకు రూ.33 లక్షల పరిహారం ఇస్తున్నా తమకు రూ.8 లక్షలు మాత్రమే ఇచ్చి మిగతా మొత్తాన్ని దేవాదాయ శాఖకు ఇస్తున్నారని చెప్పారు. ఈ విషయంలో న్యాయం జరిగేలా పోరాడతానని కవిత హామీ ఇచ్చారు. మహారాష్ట్రలోని లాతూర్ కోచ్ ఫ్యాక్టరీలో భూములు కోల్పోయిన వారికి 734 ఉద్యోగాలు ఇచ్చారని గుర్తుచేశారు. అదే విధంగా ఇక్కడ కూడా బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వచ్చేలా చేస్తామని, కోచ్ ఫ్యాక్టరీ ప్రారంభమయ్యేలోపు న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు. ఈ అంశంపై కేంద్ర రైల్వే శాఖ మంత్రితోపాటు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు లేఖ రాస్తానని తెలిపారు. తరాలపల్లిలో పోచమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో కవిత పాల్గొని అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అసెంబ్లీ వద్ద మహిళా శాసనసభ్యుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపైనా స్పందించారు. సీనియర్ మహిళా ఎమ్మెల్యేల గొంతు పట్టి నెట్టేయడం, చీరలు లాగడం, బూటు కాళ్లతో తొక్కి హింసించడం దుర్మార్గమని ఎక్స్ వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలకే భద్రత లేకపోతే సామాన్య మహిళల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. మహిళలపై హింస, దాడులు పెరుగుతున్నాయని విమర్శించారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడులకు కారణమైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# హామీలపై కాంగ్రెస్‌ను ఎండగడతాం

- **1000 రోజులు దాటినా 420 హామీలు ఎందుకు అమలు చేయలేదు?**
- **ఫీజు రీయింబబుమెంట్ బకాయిలపై సమాధానం చెప్పాలి**
- **22ఏ భూములు, రైతులు, యువత సమస్యలపై నిలదీస్తాం**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** బాండ్ పేపర్లపై హామీలు రాసిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. 1000 రోజులు దాటినా ఒక్క హామీని కూడా పూర్తిగా నెరవేర్చలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో ప్రజల తరపున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అన్ని అంశాలపై నిలదీస్తామని తెలిపారు. గన్‌పార్క్ వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. 1000 రోజులు దాటినా ఎందుకు అమలు చేయలేదో సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సమస్యలపై కూలంకషంగా చర్చించేందుకు అసెంబ్లీ సమావేశాలను నెల రోజులపాటు నిర్వహించాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.18 వేల కోట్లకు చేరడానికి కారణమేంటో అసెంబ్లీలో ప్రశ్నిస్తామని కేటీఆర్ చెప్పారు. విద్యార్థులు, యువత, రైతులు, సింగరేణి కార్మికులు, ఆటో డ్రైవర్ల సమస్యలను సభలో ప్రస్తావిస్తామని తెలిపారు. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపైనా ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. 22ఏ కింద ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టడంపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రుల బంధువులకు భూ కేటాయింపులు చేస్తున్నారని ఆరోపిస్తూ దీనిపైనా సమాధానం రాబడతామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు, అంగన్‌వాడీలు, సర్వేయర్ల సమస్యలపై చర్చ జరగాలని డిమాండ్ చేశారు. ఎన్ని కుట్రలు చేసినా ప్రజల తరపున ప్రశ్నించేందుకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# కనీసం 15 రోజులు అసెంబ్లీ నడపాలి

- **బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి**

**కాకతీయ, హైదరాబాద్ :** రాష్ట్రంలో ప్రజా సమస్యలు అనేకం ఉన్నందున అసెంబ్లీ సమావేశాలను కనీసం 15 రోజులపాటు నిర్వహించాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. 22ఏ నిషేధిత భూముల జాబితాపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. అసెంబ్లీ బీఏసీ సమావేశంలో ఆయన ఈ డిమాండ్లు చేశారు. శాసనసభ సమావేశాలను ఈనెల 12 వరకు కొనసాగించాలని బీఏసీ ప్రాథమికంగా నిర్ణయించింది. అవసరమైతే సమావేశాలను పొడిగించడంపై మరోసారి సమీక్షించాలని నిర్ణయించారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు ప్రత్యేక అజెండాను రూపొందించారు. 22ఏ, ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాలపై స్వల్పకాలిక చర్చలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించేందుకు అసెంబ్లీని కనీసం 20 నుంచి 30 రోజులపాటు నిర్వహించాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. బీఏసీ సమా



వేశాన్ని బీఆర్ఎస్ బహిష్కరించింది. అసెంబ్లీకి వెళ్తున్న సమయంలో తమ పార్టీ ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించారని బీఆర్ఎస్ ఆరోపించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్, మైనారిటీ అంశాలపై చర్చించాలని ఎంఐఎం ఎమ్మెల్యే బలాల కోరారు. ప్రభుత్వం ఎన్నిరోజులైనా సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉందని శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. శాసనమండలి సమావేశాలను వారం రోజులపాటు నిర్వహించాలని మండలి బీఏసీ నిర్ణయించింది. అవసరమైతే సభ్యుల కోరిక మేరకు మరిన్ని రోజులు పొడిగిస్తామని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, ఎఫ్ఎండీ, శ్రీపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నీటి కష్టాలకు కేసీఆర్ వైఫల్యాలే కారణం

(మొదటిపేజీ తరువాయి)

పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రైతుల ఇబ్బందులకు ఇద్దరే కారణమని, ఒకరు మిస్టర్ ఎల్‌నినో అయితే మరొకరు మిస్టర్ కేసీఆర్ అని వ్యాఖ్యానించారు. ప్రకృతి సృష్టించిన ప్రతికూల పరిస్థితులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ అసమర్థ సాగునీటి విధానాలు తోడవడంతో రాష్ట్రంలో నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చిందన్నారు. శాసనసభ లాబీల్లో సోమవారం మీడియా ప్రతినిధులతో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న నీటి పరిస్థితి, గత ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టులపై చేసిన వ్యయం, కృష్ణా జలాల వినియోగం, కాళేశ్వరం పునరుద్ధరణ తదితర అంశాలపై మాట్లాడారు. ఎల్‌నినో కారణంగా ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం, నీటి లభ్యతపై ప్రభావం పడుతుందని, అది తెలంగాణ ప్రభుత్వం సృష్టించిన పరిస్థితి కాదని అన్నారు. దాని ప్రభావం ఒక్క తెలంగాణకే పరిమితం కాలేదని తెలిపారు. నీటి లభ్యత తగ్గే అవకాశాలను ముందుగానే అంచనా వేసి, నీటి వసతి అనిశ్చితంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రైతులకు పలుమార్లు సూచించామని చెప్పారు.

**రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు.. ప్రాజెక్టులు మాత్రం అసంపూర్తి**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాగునీటి రంగంపై సుమారు రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పుకున్నప్పటికీ, రాష్ట్ర ఆవిర్భావ సమయంలో పెండింగ్‌లో ఉన్న ప్రధాన ప్రాజెక్టుల్లో ఒక్కదానినీ సంపూర్ణంగా పూర్తి చేయలేకపోయారని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



విమర్శించారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా, ఎస్ఎల్‌బీసీ సొరంగం వంటి కీలక ప్రాజెక్టులు భారీగా నిధులు వెచ్చించినా అసంపూర్తిగానే మిగిలిపోయాయని అన్నారు. సాగునీటి ప్రయోజనాలకు అనుగుణంగా ఫలితాలు సాధించకుండా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఆర్ఈసీ వంటి సంస్థల నుంచి అధిక వడ్డీలకు భారీగా రుణాలు తీసుకున్నారని, ఆ అప్పుల భారాన్ని తెలంగాణ ప్రజలే మోయాల్సి వస్తోందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ప్రచారాన్ని ఆయన తప్పుబట్టారు. సుమారు రూ.27,500 కోట్లు ఖర్చు చేసినప్పటికీ పంట పొలాలకు నీటిని చేర్చే డిస్ట్రిబ్యూటరీ కాలువల వ్యవస్థను నిర్మించలేదన్నారు. కాలువల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కూడా నామమాత్రంగానే జరిగిందని, అలాంటి ప్రాజెక్టును 90 శాతం పూర్తి చేశామని చెప్పడం పచ్చి అబద్ధమని విమర్శించారు. జూరాల నుంచి శ్రీశైలానికి నీటి వనరును మార్చడంపైనా ప్రశ్నించారు. జూరాల పూర్తిగా తెలంగాణ భూభాగంలో ఉండగా, శ్రీశైలం తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ జల సంబంధాల్లో ఉమ్మడి జలాశయమని గుర్తుచేశారు.

**బీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌ను ప్రశ్నించే నైతిక హక్కు లేదు**

పదేళ్లు అధికారంలో ఉండి సాగునీటి ప్రాజెక్టులను అసంపూర్తిగా వదిలేసిన బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కు లేదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. డిండి, గౌరవెల్లి, సీతారామ ప్రాజెక్టులకు సంబంధించిన కీలక అనుమతులు, ప్రధాన పనులను గత ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందన్నారు. డిండి ప్రాజెక్టుకు నీటి వనరును ఖరారు చేయడంతోపాటు పనులను ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ.1,800 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ప్రధాన ప్రాజెక్టులకు అవసరమైన పర్యావరణ అనుమతులను కూడా గత ప్రభుత్వం సాధించలేకపోయిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయి నిర్మాణ భద్రతే ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితుల్లో ప్రజలను అక్కడికి తీసుకెళ్లి ఏం చూపిస్తారని కేసీఆర్‌ను ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఈ దుస్థితి ఎందుకు వచ్చిందో ముందుగా తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. నిపుణుల పరిశీలనల్లో బ్యారేజీల పునాదులు, నిర్మాణ వ్యవస్థలకు సంబంధించి తీవ్రమైన లోపాలు వెలుగు చూశాయని తెలిపారు. దేశీయ, అంతర్జాతీయ నిపుణుల సలహాలతో డయాఫ్రం వాల్స్, స్టిల్లింగ్ బేసిన్ వ్యవస్థల మెరుగుదలతోపాటు దీర్ఘకాలిక భద్రతకు అవసరమైన పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

**కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా వదులుకోం**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన 3 జల సంవత్సరాల్లో తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన కృష్ణా జలాలను సమర్థంగా వినియోగించుకున్నామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణకు దక్కాల్సిన ప్రతి నీటి బొట్టునూ సద్వినియోగం చేసుకోవాలన్న చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని తెలిపారు. కృష్ణా, గోదావరి నదీజలాల్లో తెలంగాణ న్యాయమైన వాటా కోసం జల వివాదాల ట్రిబ్యునళ్లు, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సహా ప్రతి సమర్థ వేదికపైనా రాజీలేని పోరాటం కొనసాగిస్తున్నామని అన్నారు. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ విచారణల కోసం తాను స్వయంగా న్యూఢిల్లీ వెళ్లి న్యాయవాదులు, ఇంజినీర్లు, ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ తెలంగాణ వాదనను బలంగా వినిపించేలా చర్యలు తీసుకున్నానని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు అనుకూలంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్న బీఆర్ఎస్ విమర్శలను ఖండించారు. తాను తెలంగాణ ప్రజలకు మాత్రమే జవాబుదారినని స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖకు అవసరమైన నిపుణుల సేవలను మంత్రిగా తానే నిర్ణయిస్తానన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలను సరిదిద్దాల్సిన బాధ్యత తమపై పడిందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 2014లోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉంటే ప్రాణహిత-చేవెళ్ల, జూరాల ఆధారిత పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమా, ఎస్ఎల్‌బీసీ, డిండి, గౌరవెల్లి ప్రాజెక్టులను తక్కువ వ్యయంతో పూర్తి చేసి ఉండేవారమన్నారు. రీడిజైన్ల పేరుతో అంచనా వ్యయాలను పెంచిన బీఆర్ఎస్ ప్రభుత్వం అందుకు అనుగుణంగా సాగునీటి సామర్థ్యాన్ని మాత్రం సృష్టించలేకపోయిందని విమర్శించారు. పంపులను ఎప్పుడు ప్రారంభించాలో, రిజర్వాయర్లను ఎలా నిర్వహించాలో, నీటిని ఎప్పుడు విడుదల చేయాలో తమకు తెలుసని అన్నారు. రాబోయే వేసవిలో సాగునీరు, తాగునీటి అవసరాలకు ఇబ్బందులు రాకుండా అందుబాటులో ఉన్న జలాశయ నిల్వలను శాస్త్రీయంగా పరిరక్షిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రధాన పెండింగ్ ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో పూర్తి చేస్తామని, కాళేశ్వరం బ్యారేజీలను నిపుణుల సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతుల్లో పునరుద్ధరిస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు.

# 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

**ఏజెన్సీలో సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ అమలు చేయాలి**

**షెడ్యూల్ ప్రాంత 29 శాఖల జీవోలను చట్టం చేయాలి**

**ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలి**

**ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్‌కుమార్**



కాకతీయ, ఏటూర్‌నాగారం రూరల్ : ఏజెన్సీ ప్రాంతాల్లో సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ అమలు చేయాలని, షెడ్యూల్ ప్రాంతంలోని 29 శాఖల ప్రభుత్వ ఉత్తర్వులను చట్టబద్ధం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు డా. మైపతి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని, ఆదివాసీలపై అటవీశాఖ దాడులను నియంత్రించాలని, 5వ షెడ్యూల్ ప్రాంతాల్లో కంపెనీల పేరుతో జరుగుతున్న విధ్వంసాన్ని అడ్డుకోవాలని కోరారు. ఆదివాసీల హక్కులు, భూములు, విద్య, ఉద్యోగాలు, రాజ్యాంగ రక్షణలను కాపాడాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) ఆధ్వర్యంలో సోమవారం ఏటూర్‌నాగారం మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి ఐటీడీఏ వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. 17 అంశాలతో కూడిన వినతిపత్రాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి మైపతి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అందజేశారు.

**ఆదివాసీల భూములు, అటవీ హక్కులకు రక్షణ కల్పించాలి**

రాష్ట్రంలోని 5వ షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీల రాజ్యాంగ హక్కులను పటిష్ఠంగా అమలు చేయాలని అరుణ్‌కుమార్ అన్నారు. భూహక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవడంతో పాటు ఆర్టికల్ 244(1), ఆర్టికల్ 342, ఆర్టికల్ 19(ఈ), ఐటీడీఏ బైలాస్, పీసా చట్టం, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని, చట్టవిరుద్ధ భూకబ్జాలు, బదలాయింపులపై చర్యలు తీసుకోవాలని కోరారు. 5వ షెడ్యూల్ ప్రాంతాల్లో భూముల పరిరక్షణకు ప్రత్యేక యంత్రాంగాన్ని బలోపేతం చేయాలని, గ్రామసభల అధికారాలను గౌరవిస్తూ పీసా చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని అన్నారు. అటవీశాఖ దాడులను నియంత్రించాలని, 5వ షెడ్యూల్ ప్రాంతాల్లో కంపెనీల పేరుతో జరుగుతున్న విధ్వంసాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో ఆదివాసీలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో ఏర్పడుతున్న ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రాజెక్టులు, ఇతర ఉపాధి అవకాశాల్లో స్థానిక ఆదివాసీ యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని అన్నారు.

**విద్య, ఉద్యోగాల్లో స్థానిక ఆదివాసీ యువతకు ప్రాధాన్యత ఇవ్వాలి**

ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్నత విద్యకు మరిన్ని అవకాశాలు కల్పించాలని అరుణ్‌కుమార్ కోరారు. వైద్య, ఇంజినీరింగ్, న్యాయ, బీఈడీ, పీజీ తదితర ఉన్నత విద్యా కోర్సుల్లో ఆదివాసీ విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించాలని అన్నారు. స్థానిక యువతకు విద్య, ఉద్యోగాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు.
ఇసుక మాఫియా కారణంగా గోదావరి నది, భూగర్భ జలాలకు జరుగుతున్న నష్టాన్ని నియంత్రించాలని, 1/70 చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వడ్డీ వ్యాపారులపై సుమోటోగా చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తమ 17 డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, ఆదివాసీల హక్కులు, భూమి, విద్య, ఉద్యోగాలు, ఉపాధి, స్థానిక పరిపాలనకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి, జాతీయ అధ్యక్షుడు కొట్నాక విజయ్, ప్రధాన కార్యదర్శి ఈసం సుధాకర్, జాతీయ ఉపాధ్యక్షుడు పోడెం బాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి సిద్ధబోయిన లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పులుష బాలకృష్ణ, పడిగ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి కోరగట్ల లక్ష్మణరావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రేఖ గణేష్, ములుగు జిల్లా అధ్యక్షుడు నల్లబోయిన లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి కోరినబెల్లి గణేష్, రాష్ట్ర కార్యదర్శి సిద్ధబోయిన కార్తీక్, ఉపాధ్యక్షుడు కబ్బాక లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు దబ్బకట్ల శ్రీకాంత్, ఆదివాసీ మహిళా సంఘం అధ్యక్షురాలు వట్టం సుభద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పాయం కోటేశ్వరరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనం చంటి, డివిజన్ అధ్యక్షుడు పోవడం శోభన్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు కుంజ నరసింహారావు, రాష్ట్ర కార్యదర్శి కుడిమేత సమ్మయ్య, భూపాలపల్లి అధ్యక్షుడు గొరిగ కిరణ్, భూపాలపల్లి ప్రధాన కార్యదర్శి మట్టి కృష్ణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు ధారబోయిన రమేష్, స్థానిక నాయకుడు వంక నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇదేనా నవోదయం?

**మామునూరు నవోదయ విద్యాలయంలో సమస్యల వలయం**

**ప్రిన్సిపాల్ బదిలీతో కరువైన పర్యవేక్షణ**

**సదుపాయాలు అంతంతే.. విద్యార్థుల భద్రతపై ప్రశ్నలు**

**తోటి విద్యార్థి దాడిలో 7వ తరగతి విద్యార్థికి కాలు విరుగు**

**గాయపడిన విద్యార్థికి సకాలంలో వైద్యం అందని పరిస్థితి**

**వరుస ఘటనలతో విద్యార్థుల్లో కలవరం**



కాకతీయ, వరంగల్ : మామునూరు జవహర్ నవోదయ విద్యాలయంలో పరిపాలన, పర్యవేక్షణ వ్యవస్థ గాడి తప్పుతోంది. ప్రతిష్టాత్మక విద్యాసంస్థగా పేరున్న ఈ విద్యాలయంలో కొంతకాలంగా విద్యార్థుల భద్రత, హాస్టల్ పరిశుభ్రత, మౌలిక సదుపాయాల విషయంలో సమస్యలు కొనసాగుతున్నాయి. పూర్తిస్థాయి ప్రిన్సిపాల్ బదిలీపై వెళ్లిన తర్వాత ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ పర్యవేక్షణలో లోపాలు స్పష్టమవుతున్నాయి. విద్యార్థుల మధ్య గొడవలు, గాయాల ఘటనలు వరుసగా చోటుచేసుకుంటుండటంతో తల్లిదండ్రుల్లో ఆందోళన పెరుగుతోంది. విద్యాలయంలో హాస్టల్ పరిశుభ్రత, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, విద్యార్థుల క్రమశిక్షణ, భద్రతకు సంబంధించిన అంశాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం. అయితే ప్రిన్సిపాల్ బదిలీ తర్వాత ఈ వ్యవస్థ బలహీనపడింది. సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య విభేదాలు చోటుచేసుకోవడంతో పాటు పలువురు విద్యార్థులు గాయపడిన ఘటనలు జరిగాయి. 2 నెలల క్రితం నవోదయ సంస్థ డిప్యూటీ కమిషనర్ నిర్వహించిన సమీక్షలో విద్యాలయానికి సంబంధించిన పలు అంశాలు పరిశీలనకు వచ్చినప్పటికీ, ఆ తర్వాత కూడా సమస్యలు కొనసాగుతున్నాయి. వారం క్రితం ఓ విద్యార్థి డార్మిటరీలో జారిపడి తలకు బలమైన గాయం కావడం పరిస్థితిని తెలియజేస్తోంది. మరోవైపు వైరల్ ఫీవర్ల కారణంగా పలువురు విద్యార్థులు ఇళ్లకు వెళ్లారు.

**తోటి విద్యార్థి దాడిలో బిట్టుకు కాలు విరుగు**

తాజాగా 7వ తరగతి విద్యార్థి బొట్ల బిట్టు గాయపడిన ఘటన విద్యాలయంలో కలకలం రేపింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గాంధీనగర్‌కు చెందిన బిట్టు గత ఏడాది 6వ తరగతిలో నవోదయలో చేరాడు. శనివారం తోటి విద్యార్థి ప్రజ్వన్‌తో జరిగిన ఘటనలో బిట్టు తీవ్రంగా గాయపడ్డాడు. అదే రోజు సాయంత్రం విషయాన్ని హౌస్ మాస్టర్ దృష్టికి తీసుకెళ్లగా, రాత్రి సమయంలో తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఆదివారం ఉదయం తల్లిదండ్రులు బిట్టును ఆసుపత్రికి తీసుకెళ్లగా కాలు విరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. బిట్టుకు గాయం అయిన వెంటనే వైద్యసేవలు అందించకుండా తల్లిదండ్రులు వచ్చే వరకు వేచి ఉండటం ఇప్పుడు ప్రధాన సమస్యగా మారింది. విద్యార్థి గాయపడిన విషయాన్ని తల్లిదండ్రులకు అదే సమయంలో తెలియజేయకపోవడంతో వారు మరుసటి రోజు ఉదయం విద్యాలయానికి వచ్చి ఆసుపత్రికి తీసుకెళ్లాల్సి వచ్చింది. హౌస్ మాస్టర్ పర్యవేక్షణలో ఉన్న విద్యార్థికి తీవ్ర గాయం కావడం, అనంతరం వైద్యం అందించడంలో జాప్యం జరగడం సిబ్బంది బాధ్యతల నిర్వహణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఘటన అనంతరం బాధిత విద్యార్థి పరిస్థితిని పట్టించుకోకుండా గాయానికి కారణమైన విద్యార్థికి మద్దతుగా వ్యవహరించినట్లు కూడా తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

**భద్రతా వ్యవస్థను పటిష్టం చేయాలి**

నవోదయ విద్యాలయంలో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. హాస్టళ్లలో నిరంతర పర్యవేక్షణ, హౌస్ మాస్టర్ల అందుబాటు, విద్యార్థుల మధ్య గొడవలను ముందుగానే గుర్తించే వ్యవస్థ, అత్యవసర వైద్యసేవలు, తల్లిదండ్రులకు తక్షణ సమాచారం అందించే విధానం పటిష్టంగా ఉండాలి. గతంలో డిప్యూటీ కమిషనర్ నిర్వహించిన సమీక్షలో గుర్తించిన అంశాలపై తీసుకున్న చర్యలను కూడా ఉన్నతాధికారులు పరిశీలించాలి. బిట్టు ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యాలయ పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

## తాతా మధును మండలి నుంచి సస్పెండ్ చేయాలి

**దళిత నేతపై అనుచిత వ్యాఖ్యలు ఖండనీయం**

**కక్షసాధింపు వ్యాఖ్యలకు కఠిన చర్యలు తీసుకోవాలి**

**కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండారి తిరుపతి డిమాండ్**

కాకతీయ, శంకరపట్నం: శాసనసభ స్పీకర్ స్థానంలో ఉన్న దళిత నేతపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు ఆరోపిస్తున్న అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం కేశవపట్నం అంబేద్కర్ కూడలి వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి తిరుపతి ఆధ్వర్యంలో తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని, ప్రజాస్వామ్యంలో కీలక పదవిలో ఉన్న వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. తాతా మధును వెంటనే శాసనమండలి నుంచి సస్పెండ్ చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్లు గోపగోని బసువయ్య, కిసార సంపత్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గొట్టె మధు, దేవస్థానం చైర్మన్ ఉప్పుగండ్ల మల్లారెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పద్మ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆడెపు అజయ్, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ షారుఖ్, ఎస్సీ జిల్లా కార్యదర్శులు చంద్రమౌళి, సంపత్, సర్పంచులు కర్కా చంద్రశేఖర్, మారావేణి రాజయ్య, మండల, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.



## 420 హామీలేమయ్యాయి?

**1000 రోజుల పాలనలో హామీల అమలు ఎక్కడ?**

**రైతు నుంచి యువత వరకు.. ప్రతి వర్గానికీ కాంగ్రెస్ బాకీ**

**ఇంటింటికీ 'కాంగ్రెస్ బాకీ కార్డు'తో బీఆర్ఎస్ ఉద్యమం**

**మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ ధ్వజం**



కాకతీయ, వర్ధన్నపేట / పర్వతగిరి : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముందు 6 గ్యారెంటీలు, 420 హామీలు, హామీ పత్రాలు, అఫిడవిట్‌ల ద్వారా ప్రజలకు ఇచ్చిన హామీల్లో చాలా వరకు అమలు కాలేదని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ విమర్శించారు. దాదాపు 1000 రోజుల పాలన పూర్తవుతున్నా హామీలను అమలు చేయకుండా బాకీలుగా మార్చి ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టి వేధించడం సరికాదన్నారు. కాంగ్రెస్ 1000 రోజుల పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన వారం రోజుల పోరుబాటలో భాగంగా సోమవారం పర్వతగిరి మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరం నుంచి ర్యాలీగా వెళ్లి ఎంపీడీవోకు 6 గ్యారెంటీలు, 420 హామీల అమలుకు సంబంధించిన వినతిపత్రాన్ని అరూరి రమేష్ అందజేశారు.

**రైతుల హామీలన్నీ బాకీలుగానే మిగిలాయి**

ఎకరానికి రూ.10 వేలుగా ఉన్న రైతుబంధును రూ.15 వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని అరూరి రమేష్ అన్నారు. భూమి ఉన్న రైతులతో పాటు కౌలు రైతులకు కూడా ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని వరంగల్ రైతు డిక్లరేషన్‌లో స్పష్టంగా ప్రకటించినా అమలు చేయలేదని విమర్శించారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి చెప్పిన స్థాయిలో చేయలేదని, రైతు బీమా కింద రూ.5 లక్షల రక్షణ కల్పిస్తామని చెప్పి ప్రీమియం చెల్లింపులో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం, పంటలకు పంట బీమా అమలు చేస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదని విమర్శించారు. పంట నష్టపోయిన రైతులకు గతంలో ఎకరానికి రూ.10 వేల వరకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించామని గుర్తుచేస్తూ.. ప్రస్తుత ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో విఫలమైందన్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసి మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ఇచ్చిన హామీని కూడా అమలు చేయలేదని అన్నారు.

**మహిళలు, విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలేవీ?**

మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని అరూరి రమేష్ విమర్శించారు. మహిళలకు వడ్డీలేని రుణాలు ఇస్తామని చెప్పి అమలు చేయలేదన్నారు. కల్యాణలక్ష్మి కింద రూ.1 లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి తులం బంగారం ఇవ్వలేదని, గత ప్రభుత్వం అమలు చేసిన కల్యాణలక్ష్మి పథకాన్ని నిర్వీర్యం చేసే పరిస్థితి తీసుకొచ్చారని ఆరోపించారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు, డయాలసిస్ రోగులకు నెలకు రూ.4 వేల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదని అన్నారు. గతంలో ఉన్న రూ.2 వేల పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతామని చెప్పి అమలు చేయలేదని, కొత్త పెన్షన్లు మంజూరు చేయడంలోనూ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్, స్కూటీల హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు.

**ప్రజల హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది**

ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నిస్తున్న ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టి వేధించడం సరికాదని అరూరి రమేష్ అన్నారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కేసులకు భయపడొద్దని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. తమను ఇబ్బంది పెట్టిన వారికి సమాధానం చెబుతామని, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ మనోజ్‌గౌడ్, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ జితేందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఏకాంతం గౌడ్, యుగేందర్‌రావు, చీమల బిక్షపతి, మాజీ ఎంపీటీసీ రాజు, మండల సర్పంచులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## రసమయిపై వ్యాఖ్యలు ఖండనీయం

**వ్యక్తిగత విమర్శలు చేయడం తగదు**

**ఎమ్మెల్యే వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలి**

**బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మహిపాల్ డిమాండ్**

కాకతీయ, శంకరపట్నం : మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం శంకరపట్నం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మహిపాల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాజకీయ విమర్శలు చేయవచ్చుగానీ వ్యక్తిగతంగా కించపరిచే వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రసమయి బాలకిషన్‌పై చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే వెంటనే వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీపాదరావు సేవలు చిరస్మరణీయం

**గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**

కాకతీయ, హైదరాబాద్ : దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు ఉన్నతమైన సంస్కారం, వినయం, ప్రజల పట్ల అంకితభావం కలిగిన నాయకుడని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శాసనసభ సముదాయంలో దుద్దిళ్ల శ్రీపాదరావు కేంద్ర మందిరాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రారంభించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శ్రీపాదరావుతో తనకు వ్యక్తిగతంగా ఎంతో అనుబంధం ఉందని గవర్నర్ గుర్తుచేశారు. ఆయన ఢిల్లీ పర్యటనలకు వచ్చినప్పుడు, అప్పట్లో న్యాయ విద్యార్థిగా ఉన్న ఆయన కుమారుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి రాష్ట్రపతి భవన్‌కు వచ్చేవారని తెలిపారు. ఆ సమయంలో తాను రాష్ట్రపతికి ఏడీసీ, కంట్రోలర్‌గా పనిచేస్తున్నానని పేర్కొన్నారు. తన మామగారు ఆర్.డి.రెడ్డి, ఐఎఫ్ఎస్, శ్రీపాదరావు కాలేజీ రోజుల్లో కలిసి చదువుకున్నారని, ఎన్‌సీసీ అండర్ ఆఫీసర్లుగా పనిచేశారని శ్రీపాదరావు తనకు తరచూ గుర్తుచేసేవారని గవర్నర్ తెలిపారు.
స్పీకర్‌గా శ్రీపాదరావు రాజ్యాంగ పదవి గౌరవం, నిష్పాక్షికత, సభా సంప్రదాయాలను అత్యంత వినయంతో కాపాడారని కొనియాడారు. శ్రీపాదరావు విశిష్ట ప్రజాసేవ, చిరస్థాయిగా నిలిచే వారసత్వానికి గుర్తుగా కేంద్ర మందిరానికి ఆయన పేరు పెట్టడం సముచిత నివాళి అని అన్నారు. కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

## తాతా మధు అనుచిత వ్యాఖ్యలు ఖండనీయం

**స్పీకర్‌ను అవమానించడం.. ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే**

**రాజ్యాంగబద్ధ పదవిని కించపరచడం సరికాదు**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హితవు**

కాకతీయ, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. స్పీకర్ పదవి ఏ ఒక్క పార్టీకి, వ్యక్తికి సంబంధించినది కాదని, శాసనసభ గౌరవానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతీక అని అన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. స్పీకర్‌ను అవమానించడం అంటే శాసనసభను, ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని స్పష్టం చేశారు.రాజకీయ విభేదాలు సహజమే అయినా ప్రజాప్రతినిధులు వ్యక్తిగత దూషణలు, అనుచిత వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని సూచించారు. తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని మంత్రి పొంగులేటి డిమాండ్ చేశారు.

# ఆటో ఛార్జీల పెంపునకు సానుకూలం

- కమిటీ నివేదిక ఆధారంగా త్వరలో కొత్త ఛార్జీలు
- ఆర్టీసీ ఈవీ ఆటోలపై దుష్ప్రచారమే..
- ఓలా, ఉబెర్ తరహాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట్‌స్వామి



కాకతీయ, హైదరాబాద్: ఆటో డ్రైవర్లు, కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట్‌స్వామి అన్నారు. 2012 తర్వాత ఆటో ఛార్జీలు పెరగలేదని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఛార్జీల పెంపునకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. కమిటీ నివేదిక ఆధారంగా త్వరలో కొత్త ఛార్జీలు అమలు చేస్తామని చెప్పారు. సచివాలయంలో ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుపై కేబినెట్‌లో చర్చించి, శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. టీజీఎస్ఆర్టీసీ ద్వారా ఈవీ ఆటోలు ప్రవేశపెట్టి లాస్ట్ మైల్ కనెక్టివిటీ పాలసీ తీసుకురానున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

**ఆటో కార్మికులకు ఆర్థిక చేయూత**

ఓలా, ఉబెర్, ర్యాపిడో తరహాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్ రూపొందించే అంశంపై ఐటీ శాఖతో సంప్రదింపులు జరుపుతున్నామని మంత్రి తెలిపారు. జీఓ ఎంఎస్ నంబర్ 263 కింద తిరస్కరించిన కేసులు, గడువు ముగిసిన పర్మిట్లకు సంబంధించిన ఆటో రిక్షా పర్మిట్ కోటాను విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అగ్రిగేటర్ పాలసీపై అధ్యయనం చేసేందుకు కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో సుమారు 18,700 ఆటోలను రెట్రోఫిట్మెంట్ చేసుకునేందుకు ఒక్కో ఆటోకు రూ.1.50 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. ఇందుకోసం వివిధ శాఖల సమన్వయంతో సుమారు రూ.200 కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. ఆటో డ్రైవర్ల ప్రమాద, సహజ మరణ బీమాపైనా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

- ప్రజావాణిలో 88 దరఖాస్తుల స్వీకరణ
- అధికారుల సమన్వయంతో సత్వరమే పరిష్కరించాలి
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న ఆదేశం



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, దరఖాస్తులను సత్వరమే పరిష్కరించి మెరుగైన పౌర సేవలు అందించడమే బల్దియా ప్రధాన లక్ష్యమని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అన్నారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 88 దరఖాస్తులను స్వీకరించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత విభాగాలకు పంపించాలని, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించి ఫిర్యాదుదారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజావాణి కేవలం దరఖాస్తుల స్వీకరణకే పరిమితం కాకుండా సమస్యలకు పరిష్కారం చూపే వేదికగా ఉండాలని పేర్కొన్నారు. టౌన్‌ప్లానింగ్ 37, ఇంజినీరింగ్ 30, ప్రజారోగ్యం, పారిశుధ్యం 7, రెవెన్యూ 9, నీటి సరఫరా 4, ఎలక్ట్రికల్ 1 దరఖాస్తు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్‌ఈ రాజ్‌కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, సెక్రటరీ అనిల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## బాలికల హాస్టల్‌లో దారుణ పరిస్థితులు

- నీటి సౌకర్యం లేక విద్యార్థినుల అవస్థలు
- వార్డెన్ వేధింపులపై విద్యార్థినుల ఆందోళన
- సమస్యలను వెంటనే పరిష్కరించాలని


**విద్యార్థినులు, తల్లిదండ్రుల డిమాండ్**



**కాకతీయ, ఏటూరునాగారం రూరల్:** ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్‌లో నీటి సౌకర్యం లేక మూడో అంతస్తు వరకు బకెట్లతో నీటిని మోసుకెళ్లాల్సి వస్తోందన్నారు. బాత్రూమ్‌లు, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. సమస్యలను వార్డెన్ దృష్టికి తీసుకెళ్లి ప్రశ్నిస్తే బూతులు తిడుతూ వేధిస్తున్నారని, దాడికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం హాస్టల్ నుంచి బయటకు వచ్చి ఆందోళన చేపట్టారు. మీడియా ముందు విద్యార్థినులు కన్నీటిపర్యంతమయ్యారు. అయితే కొందరు టీచర్లు విద్యార్థినులను గదుల్లోకి పంపి మీడియాతో మాట్లాడకుండా అడ్డుకున్నారని ఆరోపణలు వినిపించాయి. తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, వార్డెన్‌పై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

## మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు స్వాహా..!

- వేతనాల చెల్లింపుల్లో అవకతవకలపై విచారణ చేయాలి
- మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి
- మల్టీపర్పస్ వర్కర్ల డిమాండ్



**కాకతీయ, నల్లబెల్లి:** మల్టీపర్పస్ వర్కర్ల వేతనాల చెల్లింపుల్లో అవకతవకలు జరిగాయని, తమకు న్యాయం చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం నల్లబెల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న 11 మంది కార్మికుల వేతనాల్లో తేడాలు ఉన్నాయని తెలిపారు. గతంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ధర్మేందర్ హయాంలో మూడు నెలల వేతనాలు చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచారని ఆరోపించారు. కొందరికి ప్రభుత్వం నిర్ణయించిన పూర్తి వేతనాలు ఇవ్వకుండా కోతలు విధించారని, ఆ మొత్తాలు ఎక్కడికి వెళ్లాయో తేల్చాలని కోరారు. ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, అవకతవకలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆరోపణలపై అధికారులు, మాజీ పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్ వివరణ తెలియాల్సి ఉంది.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండనీయం

**కాంగ్రెస్ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మని శేఖర్‌రావు ఫిర్యాదు**




**కాకతీయ, హన్మకొండ :** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు సూచన మేరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మని శేఖర్‌రావు సోమవారం హన్మకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా, ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం కలిగించేలా ఉన్నాయని పేర్కొన్నారు. వాటిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాప్రతినిధులపై వ్యక్తిగత, అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఫిర్యాదును పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గడ్డం విష్ణు ప్రసాద్, పోలేపాక బుచ్చిరెడ్డి, రఫీ, పాషా, నాయిని లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏఐఏసీ జాతీయ కోఆర్డినేటర్‌గా శోభన్‌బాబు కొనసాగింపు



**కాకతీయ, ఇనుగుర్తి:** మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం నర్సింగాపురం (అయ్యగారుపల్లి) గ్రామానికి చెందిన భూక్య శోభన్‌బాబుకు కాంగ్రెస్ పార్టీ మరో కీలక బాధ్యత అప్పగించింది. ఆదివాసీ ప్రొఫెషనల్ గ్రూప్ తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల ఇన్‌చార్జ్‌గా ఆదివారం నియమించింది. ప్రస్తుతం ఆయన ఆల్ ఇండియా ఆదివాసీ కాంగ్రెస్ (ఏఐఏసీ) జాతీయ కోఆర్డినేటర్‌గా, కర్ణాటక రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆదివాసీ కాంగ్రెస్ కార్యక్రమాలు, ఎన్నికల నిర్వహణ, వార్‌రూమ్ కార్యకలాపాలు, విద్యార్థి, యువజన కార్యక్రమాలు, ఆదివాసీ హక్కుల ఉద్యమాల్లో శోభన్‌బాబు క్రియాశీలంగా పనిచేస్తున్నారు. కొత్త బాధ్యతల్లో డాక్టర్లు, ఇంజినీర్లు, న్యాయవాదులు, ఐటీ నిపుణులు, విద్యావేత్తలు, పరిశోధకులు, వ్యాపారవేత్తలు, స్టార్టప్ వ్యవస్థాపకులు, ఉద్యోగులు, సామాజిక కార్యకర్తలను సమన్వయం చేస్తానన్నారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, మెంటార్‌షిప్, నాయకత్వ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచిన కన్వీనర్ అడ్వకేట్ అర్చనా పొత్రే, ఏఐఏసీ చైర్మన్ డా. విక్రాంత్ భూరియా, కె. రాజు ఐఏఎస్, మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శోభన్‌బాబుకు మండల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

# హామీలను గాలికొదిలిన కాంగ్రెస్

- 1000 రోజుల పాలన ప్రజలకు నిరాశే
- 420 హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- రైతులు, విద్యార్థులు, మహిళలు, యువత సమస్యలను పట్టించుకోవడం లేదు
- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



**కాకతీయ, చెన్నారావుపేట:** ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనను పూర్తి చేసుకున్న నేపథ్యంలో సోమవారం చెన్నారావుపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మండల పార్టీ అధ్యక్షుడు బాల్నే వెంకన్నతో కలిసి ముత్తిరెడ్డి నిరసనలో పాల్గొని అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు వాటి అమలును విస్మరించిందని ముత్తిరెడ్డి ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500, ఉచిత స్కూటీలు, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా, పంటల కొనుగోలు, సాగునీరు, నాణ్యమైన విద్యుత్ విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై ప్రశ్నించారు. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం, కేసీఆర్ కిట్ హామీల పరిస్థితి ఏంటని నిలదీశారు.

**నర్సంపేటపై నిర్లక్ష్యం**

నర్సంపేట నియోజకవర్గంలో రైతులు, విద్యార్థులు, మహిళలు, యువత, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని ముత్తిరెడ్డి విమర్శించారు. ప్రజలు ఓట్లు వేసి గెలిపించింది సమస్యల పరిష్కారం కోసమేనని, అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్, మిషన్ భగీరథ, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర సంక్షేమ పథకాలను అమలు చేశామని గుర్తుచేశారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రావచ్చు గానీ ప్రజల ప్రశ్నల నుంచి తప్పించుకోలేరని ముత్తిరెడ్డి అన్నారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకపోతే ప్రజల తరఫున బీఆర్ఎస్ మరింత ఉధృతంగా పోరాటం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్లు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, యువజన నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలి

- సమన్వయంతోనే శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యం
- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్
- భారీ జనసందోహాల నిర్వహణపై ప్రత్యేక శిక్షణ





**కాకతీయ, వరంగల్ బ్యూరో :** పండగలు, జాతరలు, ఊరేగింపుల సమయంలో భారీగా ప్రజలు గుమిగూడినప్పుడు శాంతిభద్రతలను సమర్థంగా నిర్వహించడంతో పాటు, ప్రజల పట్ల పోలీసు అధికారులు, సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత అన్నారు. ఈ అంశాలపై పోలీస్ శిక్షకులకు మడికొండలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో సోమవారం నాలుగు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు. వరంగల్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్లతో పాటు మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు మొత్తం 43 మంది పోలీస్ శిక్షకులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. పండగలు, జాతరలు, ఊరేగింపుల సమయంలో భారీ జనసమూహాల మధ్య విధులు నిర్వహించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రజలతో వ్యవహరించాల్సిన తీరుపై శిక్షణ ఇస్తున్నారు.

**తరగతి గది బోధనతో పాటు ప్రాక్టికల్ శిక్షణ**

శాంతిభద్రతలకు సంబంధించిన కార్యక్రమాల్లో భారీగా ప్రజలు గుమిగూడినప్పుడు జనసందోహాన్ని నియంత్రించడం, అత్యవసర పరిస్థితుల్లో సమన్వయంతో పనిచేయడం, ఉద్రిక్తతలను అదుపు చేయడం, ప్రజలతో మర్యాదగా వ్యవహరించడం వంటి అంశాలను శిక్షణలో బోధిస్తున్నారు. తరగతి గదుల్లో బోధించడంతో పాటు ఆయా అంశాలను ప్రాక్టికల్‌గా కూడా అధికారులు వివరిస్తున్నారు. శిక్షణ పొందిన పోలీస్ శిక్షకులు తమ తమ జిల్లాల్లోని పోలీస్ యూనిట్లలో అధికారులు, సిబ్బందికి ఇదే తరహాలో శిక్షణ అందించనున్నారు. తద్వారా పండగలు, జాతరలు, ఊరేగింపుల సందర్భంగా ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించడంతో పాటు శాంతిభద్రతలను సమర్థంగా నిర్వహించేలా సిబ్బందిని సన్నద్ధం చేయనున్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు ప్రభాకర్‌రావు, శ్రీనివాస్, సీటీసీ ఏసీపీ రమణబాబు, ఆర్ఐలు సింహాచలం, శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ సూర్యప్రసాద్‌తో పాటు శిక్షణ కేంద్రం పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మతిస్థిమితం లేని మహిళ మృతి

కాకతీయ, గీసుగొండ : మతిస్థిమితం సరిగా లేని మహిళ మోతాదుకు మించి డోలో మాత్రలు మింగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన గీసుగొండ మండలంలో చోటు చేసుకుంది. సీఐ డి.విశ్వేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దస్రు తండా గ్రామానికి చెందిన హలావత్ జమ్మి (50) కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో బాధ పడుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 1న ఉదయం కుటుంబ సభ్యులు నిద్రలేచి చూడగా ఆమె అపస్మారక స్థితిలో ఉండటంతోపాటు, చేతిలో ఖాళీ డోలో మాత్రల షీట్ కనిపించినట్లు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స కోసం చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 6న మధ్యాహ్నం 3 గంటల సమయంలో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి కుమారుడు హలావత్ వీరేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గీసుగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

# స్పీకర్‌పై తాతా మధు వ్యాఖ్యలు దుర్మార్గం

- కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలి
- తాత మధుపై బీఆర్ ఎస్ తక్షణమే క్షమాపణ చెప్పాలి
- రాజ్యాంగ వ్యవస్థను, శాసనసభ గౌరవాన్ని అవమానించడమే
- హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి



**కాకతీయ, హనుమకొండ :** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలు దుర్మార్గమని హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలకు తాతా మధు తక్షణమే స్పీకర్‌కు, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధిష్ఠానం ఆయనపై వెంటనే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కోరారు. తాతా మధు వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం హసన్‌పర్తి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రేణిగుంట్ల అశోక్, డివిజన్ అధ్యక్షులు నేదునూరి సునీల్, పుట్ట తిరుపతి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమానికి ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్‌ను కించపరిచేలా బాధ్యతారహితంగా మాట్లాడటం బీఆర్ఎస్ నేతల అహంకారానికి నిదర్శనమని ఇనగాల మండిపడ్డారు. స్పీకర్ పదవిని అవమానించడం ఒక వ్యక్తిని కించపరచడం మాత్రమే కాదని, మొత్తం రాజ్యాంగ వ్యవస్థను, శాసనసభ గౌరవాన్ని అవమానించడమేనని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. అట్టడుగు వర్గానికి చెందిన దళిత బిడ్డ శాసనసభ స్పీకర్‌గా ఉన్నందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు రావడం లేదని, అదే సమయంలో ఆయన పార్టీ నాయకులు బయటకు వచ్చి రాజకీయ డ్రామాలు చేస్తున్నారని ఇనగాల విమర్శించారు. తన పార్టీకి చెందిన ఎమ్మెల్సీ రాజ్యాంగ పదవిని అవమానించేలా వ్యాఖ్యలు చేసినా కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

**తాతా మధుపై చర్యలు తీసుకోవాలి**

తాతా మధుపై బీఆర్ఎస్ అధిష్ఠానం తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఇనగాల డిమాండ్ చేశారు. అవసరమైతే ఆయనను సస్పెండ్ చేసి ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేసే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం స్పీకర్‌పై తాతా మధు చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బాల్మంచ్ అధ్యక్షుడు జిన్నపురెడ్డి రుగ్వేద్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కిరణ్, సురేందర్‌రెడ్డి, ఐలయ్య, డీసీసీ నాయకులు బుచ్చిరెడ్డి, రవీందర్, మధు, సురేష్, రాజు, వెంకన్న, మహిళా నాయకురాలు పల్లెపు అనూష తదితరులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్ హామీలు అమలు చేయాలి

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌కు బీఆర్ఎస్ వినతి
- 420 హామీలు, 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్
- పారిశుధ్య పనులు చేపట్టి కాలనీల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి
- బీఆర్ఎస్ మహిళా విభాగం నాయకులు

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలు, 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ 66 డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞాపన పత్రం అందజేశారు. బీఆర్ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో హామీలు నెరవేరుస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 1000 రోజులు కావస్తున్నా ఒక్క హామీని పూర్తిగా అమలు చేయలేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500, తులం బంగారం, స్కూటీ, రైతులకు రైతుభరోసా, పంటలకు బోనస్, 24 గంటల ఉచిత విద్యుత్, రైతు కూలీలకు ఏటా రూ.12,000, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు, నిరుద్యోగులకు భృతి, జాబ్ క్యాలెండర్, విద్యార్థుల ఫీజు బకాయిల చెల్లింపు వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ కార్మికులకు రూ.4,000 పెన్షన్, ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12,000 అందించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలకు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. తమ కాలనీల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, మురికి కంపుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే పారిశుధ్య పనులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. హామీల అమలుపై ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని, వాటిని నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఆవాల రాధికా రెడ్డి, మునిగాల సరోజన, రాజశేఖర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాతా మధు సభ్యత్వం రద్దు చేయాలి

- వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్




**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** శాసనసభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు సభ్యత్వాన్ని రద్దు చేయాలని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. టీపీసీసీ ఆదేశాల మేరకు వరంగల్‌లోని పోచమ్మ మైదాన్ సెంటర్‌లో కాంగ్రెస్ శ్రేణులు సోమవారం నిరసన చేపట్టాయి. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలువేరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ.. రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్‌ను అవమానించడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమేనని అన్నారు. స్పీకర్‌పై తాతా మధు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. ఒక దళిత బిడ్డ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా ఉన్నత స్థానంలో కొనసాగుతుండగా ఆయనపై ఇలాంటి హేయమైన వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని అన్నారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని హామీ ఇచ్చి 10 ఏళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు.. ఇప్పుడు అదే దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి స్పీకర్‌గా ఉన్నత పదవిలో కొనసాగడాన్ని జీర్ణించుకోలేక ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని అయూబ్ మండిపడ్డారు.

**తాతా మధు వ్యాఖ్యలకు కేసీఆర్ సమాధానం చెప్పాలి**

స్పీకర్‌పై తాతా మధు చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమాధానం చెప్పాలని అయూబ్ డిమాండ్ చేశారు. తాతా మధును వెంటనే సస్పెండ్ చేసి, స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పించాలని కోరారు. స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్, ప్రజాప్రతినిధులు, మండల, టౌన్, డివిజన్ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ప్రశ్నించే గొంతుల అణచివేత

- బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధం
- మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

**కాకతీయ, హనుమకొండ :** ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల హక్కులను కాలరాస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రాకుండా ప్రభుత్వం వ్యవహరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు హనుమకొండ చౌరస్తాలో ప్రభుత్వ వైఖరికి నిరసనగా నిర్వహించిన ఆందోళనకు ఆయన నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రజల తరఫున తమ వాణిని వినిపించాల్సిన ప్రజాప్రతినిధులను అసెంబ్లీకి రాకుండా అడ్డుకోవడం సరైన పద్ధతి కాదని వినయ్ భాస్కర్ అన్నారు. అసెంబ్లీ ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలను సూచించే ప్రజాస్వామ్య వేదిక అని ఆయన అన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు తమ నియోజకవర్గాలు, ప్రజల సమస్యలను సభలో ప్రస్తావించే పూర్తి హక్కు ఉందన్నారు. వారిని సభకు దూరంగా ఉంచే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును ప్రతి ఒక్కరూ గౌరవించాలని, ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని ప్రతిపక్ష ప్రజాప్రతినిధులకు సభలో తమ వాణిని వినిపించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని తెలిపారు. రాస్తారోకోతో కొంతసేపు హనుమకొండ చౌరస్తాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు దాస్యం వినయ్ భాస్కర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి హనుమకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో మాజీ కూడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తరం కాకతీయ WWW.KAKATIYANEWS.COM

# రిజిస్ట్రేషన్ ఆఫీసులో రైటర్లదే రాజ్యం

- నర్సంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అనధికార వ్యవస్థ
- కొంతమంది డాక్యుమెంట్ రైటర్ల ద్వారా వెళ్తేనే పని పూర్తి
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నేరుగా వెళ్తే రిజిస్ట్రేషన్‌కు కొర్రీలు
- డాక్యుమెంటర్ రైటర్ల ద్వారా వెళ్తే అదనంగా రిజిస్ట్రేషన్‌కు రూ.10 వేల వసూళ్లు






**కాకతీయ, వరంగల్ బ్యూరో :** నర్సంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ వ్యవహారాలు డాక్యుమెంట్ రైటర్ల కనుసన్నల్లోనే సాగుతున్నాయి. ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు వచ్చే ప్రజలు నేరుగా కార్యాలయ సిబ్బందిని సంప్రదించకుండా ముందుగా డాక్యుమెంట్ రైటర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ఏ ఆస్తికి ఎంత విలువ చూపించాలి.. ఎలాంటి పత్రాలు సమర్పించాలి.. డాక్యుమెంట్‌లో ఏ వివరాలు నమోదు చేయాలన్న విషయాల్లోనూ రైటర్ల మాటే కీలకంగా మారింది. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారిక వ్యవస్థ కంటే బయట వ్యవస్థే బలంగా పనిచేస్తోందన్న చర్చ సాగుతోంది. ఫ్లాట్లు, నిర్మాణంలో ఉన్న ఆస్తులు, ఇతర స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లలోనూ నిబంధనల అమలుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఫ్లాట్లను గజాల చొప్పున రిజిస్ట్రేషన్ చేస్తున్న వ్యవహారం కనిపిస్తోంది. ఆయా నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా? లేఅవుట్, బిల్డింగ్ అనుమతులు, యాజమాన్య హక్కులు, సంబంధిత పత్రాలు సక్రమంగా ఉన్నాయా? రిజిస్ట్రేషన్‌కు ముందు అధికారులు వాటిని పూర్తిగా పరిశీలిస్తున్నారా? అన్నది తేలాల్సి ఉంది. అదే సమయంలో ప్రతి రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వానికి చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుతో పాటు మరో రూ.10 వేల వరకు అదనంగా వసూలు చేస్తున్న వ్యవహారం కూడా కార్యాలయంలో కొనసాగుతోంది.

**'యూనియన్'కే ప్రాధాన్యం..**
**రూ.70 వేల వ్యవహారం**

డాక్యుమెంట్ రైటర్లు ఒక యూనియన్‌గా ఏర్పడి కార్యాలయంలో తమకంటూ ప్రత్యేక వ్యవస్థను కొనసాగిస్తున్నారు. యూనియన్‌లో ఉన్న రైటర్లు తయారు చేసిన డాక్యుమెంట్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగుతుండగా, ఇతర రైటర్లు తీసుకొచ్చే డాక్యుమెంట్లలో మాత్రం అభ్యంతరాలు, కొర్రీలు, జాప్యాలు ఎదురవుతున్నాయి. యూనియన్‌లో చేరేందుకు ఒక్కొక్కరి నుంచి రూ.70 వేల వరకు తీసుకునే వ్యవహారం కూడా ఉంది. ఈ మొత్తాన్ని ఎవరి అనుమతితో వసూలు చేస్తున్నారు? యూనియన్‌కు ప్రభుత్వ కార్యాలయంలో ఇలాంటి ప్రాధాన్యం కల్పించేందుకు నిబంధన ఏమిటి? అనే ప్రశ్నలు వస్తున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో యూనియన్ రైటర్లకు ప్రత్యేక సహకారం అందుతున్న తీరు కూడా పరిశీలించాల్సిన అంశంగా మారింది.

**సిబ్బంది వాటాలపై వివాదం..**
**సెలవులతో జాప్యం**

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సిబ్బంది స్థాయిలోనూ అదనపు వసూళ్ల వ్యవహారం సాగుతోంది. కొన్ని సందర్భాల్లో సిబ్బంది వసూలు చేసే మొత్తం సబ్ రిజిస్ట్రార్ కంటే ఎక్కువగా ఉంటోందన్న సమాచారం ఉంది. ఈ మొత్తాల్లో వాటాల విషయంలో కార్యాలయంలో విభేదాలు ఏర్పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. సిబ్బందిలో కొందరిని బదిలీ చేసేందుకు ప్రయత్నాలు జరగడం, సబ్ రిజిస్ట్రార్-సిబ్బంది మధ్య సమన్వయం లేకపోతే సెలవులు పెట్టడం వంటి పరిణామాలతో రిజిస్ట్రేషన్ పనులు జాప్యమవుతున్నాయి. ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ విధులు నిర్వహించే సమయంలో ప్రజలు మరింత ఆలస్యాన్ని ఎదుర్కొంటున్నారు. కార్యాలయంలో అధికారిక ఫీజులు, ఇతర చార్జీల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాల్సి ఉన్నప్పటికీ, వసూళ్లపై గందరగోళం కొనసాగుతోంది. ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించి సీసీ కెమెరాల దృశ్యాలు, డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ రికార్డులు, చలానాలు, రైటర్ల అనుమతులు, అదనపు వసూళ్ల వివరాలను పరిశీలిస్తే అసలు వ్యవహారం స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# రికార్డుల్లో ఒకలా.. మోకాపై మరోలా..

- కాకతీయ కథనంపై తహసీల్దార్ నిర్లక్ష్యపు సమాధానం!
- 'మా పరిధిలోకి రాదు' అంటూ రెవెన్యూ అధికారి దాటవేత
- గతంలో జీపీఏ లేఅవుట్ చేసి ఉంటే కోర్టు స్టేతో రిజిస్ట్రేషన్లు అడ్డుకోవచ్చన్న తహసీల్దార్
- క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్న వ్యవసాయ శాఖ


ఉత్తరం కాకతీయ
epaper.kakatiyanews.com | Date: 03 Sep, 2026 | Page: 3
రికార్డుల్లో ఒకలా.. మోకాపై మరోలా!
epaper.kakatiyanews.com | 03 Sep, 2026 | Page: 3 | Clip ID: C-502954

**కాకతీయ, గీసుగొండ:** రికార్డుల్లో వ్యవసాయ భూమిగా నమోదై ఉండి.. క్షేత్రస్థాయిలో మాత్రం వ్యవసాయేతర అవసరాలకు వినియోగిస్తున్నారన్న ఆరోపణలపై వివరణ కోరితే బాధ్యతను మరో శాఖపైకి నెట్టడం రెవెన్యూ అధికారుల తీరుపై ప్రశ్నలు తలెత్తేలా చేస్తోంది. 'రికార్డుల్లో ఒకలా.. మోకాపై మరోలా!' అనే శీర్షికన కాకతీయ దినపత్రికలో ఈ నెల 3న ప్రచురితమైన కథనంపై గీసుగొండ తహసిల్దార్ ఎం.డి. రియాజుద్దీన్‌ను వివరణ కోరగా.. భూమి వ్యవసాయేతర వినియోగంపై వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించాల్సి ఉంటుందని తెలిపారు. అయితే రికార్డుల్లో భూమి స్వరూపం, క్షేత్రస్థాయిలో పరిస్థితులపై ప్రశ్నలు తలెత్తినప్పటికీ రెవెన్యూ శాఖ నుంచి క్షేత్రస్థాయి పరిశీలన ఎందుకు జరగలేదన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. సదరు భూమికి రైతుబంధు ప్రయోజనాలు పొందుతున్న వ్యక్తి అధికార పార్టీ నాయకుడనే ఆరోపణలు ఉండటంతో తహసిల్దార్ స్పందనపై స్థానికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆరోపణలకు ఆధారాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

**కోర్టు స్టేతో రిజిస్ట్రేషన్లు అడ్డుకోవచ్చు**

భూమికి సంబంధించి గతంలో జీపీఏ ద్వారా లేఅవుట్ చేసి ఉంటే, సదరు భూమికి సంబంధించిన నిర్వాసితులు కోర్టును ఆశ్రయించి స్టే ఆర్డర్ తెచ్చుకుంటే.. తమ భూమిని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయకుండా అడ్డుకోవచ్చని తహసిల్దార్ ఎం.డి. రియాజుద్దీన్ తెలిపారు. భూమి హక్కులు, రిజిస్ట్రేషన్ల విషయంలో న్యాయపరమైన ఆదేశాలు ఉంటే వాటి ప్రకారం చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

**'పరిశీలనలో తేలితే చర్యలు'..**
**వ్యవసాయ శాఖ స్పష్టీకరణ**

ఇదే విషయంపై మండల వ్యవసాయ అధికారి వి. హరి ప్రసాద్ బాబును వివరణ కోరగా.. కాకతీయ కథనంపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపడతామని తెలిపారు. సదరు భూమిని వ్యవసాయేతర అవసరాలకు వినియోగిస్తున్నట్లు పరిశీలనలో తేలితే రైతుబంధు పథకం ప్రయోజనాలను నిలిపి వేయడంతో పాటు, ఇప్పటివరకు పథకం ద్వారా పొందిన నిధులను నిబంధనల మేరకు రికవరీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖల స్పందనల నేపథ్యంలో ఈ వ్యవహారంలో అసలు వాస్తవాలు ఏమిటన్నది అధికారుల క్షేత్రస్థాయి పరిశీలనతో వెలుగులోకి రావాల్సి ఉంది.

# నల్లచొక్కాలతో నిరసన చేస్తే పోలీసుల దాడులా?

- మహిళా ఎమ్మెల్యేలపై అసెంబ్లీలో వ్యవహరించిన తీరు నీచం
- పోలీసులను అడ్డుపెట్టుకొని రాక్షస పాలన సాగిస్తున్నారు
- 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో మహిళలకు ఒరిగిందేమీ లేదు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు






**కాకతీయ, పాలకుర్తి :** నల్లచొక్కాలతో నిరసన తెలిపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై తెలంగాణ అసెంబ్లీ వద్ద పోలీసులు దాడి చేయడం అమానుషమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆనాడు పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ నల్లచొక్కాలతో నిరసనకు వెళ్లినప్పుడు ఇదే నిబంధనలు, ఇదే తెలివి ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. మీకో న్యాయం.. మాకో న్యాయమా? అని నిలదీశారు. ఈ సందర్భంగా పాలకుర్తి మండల కేంద్రంలో బీఆర్ఎస్ అధిష్ఠానం పిలుపు మేరకు కాంగ్రెస్ 1000 రోజుల పాలనకు నిరసనగా ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో ఆయన సతీమణి, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉషాదయాకర్‌రావు, బీఆర్ఎస్ మహిళా నాయకులు వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. మరోవైపు అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై పోలీసుల దాడికి నిరసనగా రాస్తారోకో చేపట్టి, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా, మండల బీఆర్ఎస్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా మహిళా శాసనసభ్యుల గొంతు నులిమి, చీర లాగడం నీచమైన చర్య అని మండిపడ్డారు. శాసనసభలోనే పోలీసులు అమానుషంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకొని రేవంత్‌రెడ్డి రాక్షస రాజ్యం నడుపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తవుతున్నా 6 గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఎర్రబెల్లి విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పిన మహాలక్ష్మి పథకాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మహిళలకు స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు ఇస్తామని చెప్పి ఎందుకు నెరవేర్చడం లేదో రేవంత్‌రెడ్డి ప్రజలకు, మహిళలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌తో పాటు తులం బంగారం ఇస్తామని బూటకపు హామీలు ఇచ్చి మహిళలను మోసం చేశారని విమర్శించారు. వృద్ధులు, ఒంటరి మహిళలకు నెలకు రూ.4 వేల పెన్షన్, వికలాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇస్తామని చెప్పి ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించకుంటే కాంగ్రెస్ పని ఖతమవుతుందని హెచ్చరించారు.

**కేసీఆర్ పాలనలోనే సంక్షేమానికి పెద్దపీట**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు, మహిళలు సంతోషంగా జీవించారని ఎర్రబెల్లి అన్నారు. ప్రజలు అడగకముందే కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి పథకాలను అమలు చేశారని తెలిపారు. వృద్ధుల పెన్షన్‌ను రూ.500 నుంచి రూ.2 వేలకు పెంచి, ఒంటరి మహిళలకు రూ.2 వేల పెన్షన్ అందించారని అన్నారు. వికలాంగులకు రూ.4 వేల పెన్షన్ అందించి వారి కాళ్లపై వారు నిలబడేలా కేసీఆర్ ప్రభుత్వం కృషి చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పీడ విరగడ కావడానికి మరో 2 ఏళ్ల సమయం మాత్రమే ఉందని, ఆ తర్వాత మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం వస్తుందని ఎర్రబెల్లి అన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేసింది, చేసేది కూడా కేసీఆర్ మాత్రమేనని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష అని అన్నారు.

# ఆర్టీఏలో డ్రైవర్లే దందాకు అండ..?

- ఆ వాహనాలు అధికారులవేనా?
- టెంపరరీ నంబర్లతో తిరుగుతున్న వాహనాలపై ప్రశ్నలు
- ప్రైవేటు వ్యక్తులే అధికారుల వెంట.. ఏఎంవీఐ డ్రైవర్ చుట్టూ వసూళ్ల వ్యవహారం
- ఇద్దరు ఏఎంవీఐలు ఉండగా మరో ఎంవీఐకి ఓడీ ఎందుకు?
- లాగిన్ లొల్లి.. వాహనాల వ్యవహారంపైనా ప్రశ్నల వర్షం




**కాకతీయ, ములుగు ప్రతినిధి :** ములుగు జిల్లా రవాణాశాఖలో వ్యవహారాలు వరుసగా చర్చనీయాంశమవుతున్నాయి. విధుల్లో లేని అధికారి అధికారిక లాగిన్, డిజిటల్ సంతకంతో ధ్రువపత్రాలు జారీ చేసిన వ్యవహారం తర్వాత ఇప్పుడు వాహన తనిఖీలకు వినియోగిస్తున్న వాహనాలు, వాటి నంబర్ ప్లేట్లు, అధికారుల వెంట తిరుగుతున్న ప్రైవేటు వ్యక్తుల పాత్ర, ఓడీపై వచ్చిన అదనపు అధికారి వ్యవహారాలు ప్రశ్నలకు దారి తీస్తున్నాయి. రిజిస్ట్రేషన్ పూర్తయిన వాహనాలు టెంపరరీ నంబర్ ప్లేట్లతో తిరుగుతున్న పరిస్థితి ఉంటే వాటి యాజమాన్యం, వినియోగం, శాఖకు కేటాయింపు వివరాలు బయటపెట్టాల్సిన అవసరం ఉంది. అధికారిక విధుల్లో ప్రైవేటు వ్యక్తులు పాల్గొంటున్నట్లయితే వారికి ఆ అవకాశం ఎవరు కల్పించారు? వారి బాధ్యత ఏమిటి? అన్నది కూడా స్పష్టం కావాల్సి ఉంది.

**ఆ వాహనాలు అధికారులవేనా?**

రవాణాశాఖ అధికారులు తనిఖీలకు వెళ్లేందుకు వాహనాలను వినియోగిస్తారు. అయితే ములుగులో తనిఖీలకు ఉపయోగిస్తున్న కొన్ని వాహనాలకు సంబంధించి టెంపరరీ నంబర్ ప్లేట్లు కనిపిస్తున్న వ్యవహారం ఇప్పుడు కీలకంగా మారింది. వాహనాలు ఇప్పటికే రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకున్నవైతే శాశ్వత రిజిస్ట్రేషన్ నంబర్ స్థానంలో టెంపరరీ నంబర్ ఎందుకు కొనసాగుతోంది? ఆ వాహనాలు రవాణా శాఖకు అధికారికంగా కేటాయించినవేనా? లేక ప్రైవేటు వ్యక్తుల వాహనాలనా? శాఖ వినియోగానికి ప్రైవేటు వాహనాలు ఉపయోగిస్తే అందుకు అనుమతి ఉందా? వాటి వినియోగానికి సంబంధించిన బిల్లులు, లాగ్‌బుక్స్, ప్రయాణ వివరాలు ఉన్నాయా? అనే అంశాలను ఉన్నతాధికారులు పరిశీలించాల్సి ఉంది.

**డ్రైవర్లే కీలకమా?**

వాహన తనిఖీల సమయంలో అధికారులతో పాటు ప్రైవేటు వ్యక్తులు కూడా తిరుగుతున్న వ్యవహారం ప్రత్యేకంగా పరిశీలించాల్సిన అంశంగా మారింది. ములుగు జిల్లాలో ఇసుక క్వారీల నుంచి నిత్యం లారీలు రాకపోకలు సాగుతున్న నేపథ్యంలో ఒక్కో ఇసుక లారీ నుంచి నెలకు రూ.7,500 వరకు వసూళ్లు జరుగుతున్న వ్యవహారం చర్చలో ఉంది. ఇందులో ఒక ఏఎంవీఐకి సంబంధించిన ప్రైవేటు డ్రైవర్ కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. తనిఖీల సమయంలో జరిమానాలు, చెల్లింపులకు సంబంధించిన వ్యవహారాలను అతడే పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది. నగదు, డిజిటల్ లావాదేవీల రూపంలో జరిగే చెల్లింపులకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తే ఈ వ్యవహారంలో వాస్తవ పరిస్థితి స్పష్టమయ్యే అవకాశం ఉంది.

**కార్యాలయంలోనూ**

> **లాగిన్ లొల్లి.. ఇప్పుడు వాహనాల వంతు!**
>
> ఇప్పటికే విధుల్లో లేని అధికారి లాగిన్, డిజిటల్ సంతకం వినియోగించి ధ్రువపత్రాలు జారీ చేసిన వ్యవహారం ములుగు రవాణాశాఖపై ప్రశ్నలు రేకెత్తించింది. తాజాగా టెంపరరీ నంబర్ ప్లేట్లతో తిరుగుతున్న వాహనాలు, ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యం, డ్రైవర్ల పాత్ర, అదనపు అధికారిని ఓడీపై తీసుకురావడం వంటి అంశాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో రవాణాశాఖ ఉన్నతాధికారులు వాహనాల ఆర్‌సీలు, శాఖ కేటాయింపు పత్రాలు, లాగ్‌బుక్స్, సీసీ కెమెరా ఫుటేజీ, తనిఖీ రికార్డులు, చలాన్లు, ఓడీ ఉత్తర్వులు, లాగిన్ వివరాలు, సంబంధిత డిజిటల్ లావాదేవీలను సమగ్రంగా పరిశీలించి నిజానిజాలు తేల్చాల్సిన అవసరం ఉంది. తప్పు ఎక్కడ జరిగిందో గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకుంటేనే శాఖపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుంది.

**ప్రైవేటు వ్యక్తి పెత్తనమా?**

ప్రైవేటు డ్రైవర్ కేవలం వాహనం నడపడానికే పరిమితం కాకుండా కార్యాలయ వ్యవహారాల్లోనూ జోక్యం చేసుకుంటున్నట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగి కాని వ్యక్తి కార్యాలయంలో అధికారిక వ్యవహారాల్లో పాల్గొనడానికి ఎవరు అనుమతించారు? రవాణాశాఖకు సంబంధించిన రికార్డులు, తనిఖీల సమాచారం, చలాన్ల వివరాలు అతడికి ఎలా అందుతున్నాయి? అధికారుల తరఫున ఏదైనా వ్యవహారం నిర్వహించే అధికారం అతడికి ఉందా? అన్నది తేలాల్సి ఉంది. దీనిపై కార్యాలయ సీసీ కెమెరాలు, డ్యూటీ రోస్టర్, తనిఖీ బృందాల వివరాలు పరిశీలిస్తే వాస్తవాలు బయటపడతాయి.

**ఇద్దరు ఏఎంవీఐలు ఉండగా**
**మరో ఎంవీఐ ఎందుకు?**

ములుగు జిల్లాలో ఇప్పటికే ఒక ఎంవీఐ, ఇద్దరు ఏఎంవీఐలు విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అయినప్పటికీ మరో జిల్లాకు చెందిన ఏఎంవీఐ వినోద్‌రెడ్డిని ములుగుకు ఓడీపై విధులకు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. అందుబాటులో ఉన్న అధికారులు, సిబ్బంది సరిపోతున్న సమయంలో అదనంగా మరో అధికారిని ఓడీపై ఎందుకు తీసుకొచ్చారు? ఇసుక లారీలు, భారీ వాహనాల తనిఖీల కోసం ప్రత్యేకంగా ఈ నిర్ణయం తీసుకున్నారా? ఓడీ ఉత్తర్వులు ఎవరు జారీ చేశారు? ఎంతకాలానికి మంజూరు చేశారు? ఏ విధులు కేటాయించారు? అన్న వివరాలను వెల్లడించాల్సి ఉంది.

# రాష్ట్రస్థాయి దడవాయి సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

**మంగళవారం ఏనుమాముల మార్కెట్‌కు సెలవు**



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ వెయిట్‌మెన్ (దడవాయి) యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరగనున్న రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మార్కెట్ దడవాయి యూనియన్ అధ్యక్షుడు మార్త శ్యామ్‌సుందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎర్ర ప్రియాంక అనిల్ చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ... దడవాయిలకు న్యాయమైన కనీస వేతనం జీఓ నెం. 57ను అమలు చేయాలని, దడవాయిలకు గౌరవం, భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. "నిష్పక్షపాత తూకం రైతుకి రక్షణ" అనే నినాదంతో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వరంగల్ జిల్లా నుండి అధిక సంఖ్యలో దడవాయిలు హైదరాబాద్ సదస్సుకు తరలివెళ్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఏనుమాముల మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అప్పని కృష్ణ, కోశాధికారి సోల రవి, ఉపాధ్యక్షులు పార్శి కృష్ణ, సహాయ కార్యదర్శి ఆకుతోట సంతోష్, కార్యవర్గ సభ్యులు ఆకుల తిరుపతి, పోకల సతీష్, తోటకూరి సతీష్, పత్రి ముక్తినర్సింహ, బజ్జూరి రాజేష్, ఆర్గనైజర్ బైరబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ

- ప్రతిపక్ష గొంతు నొక్కే కుట్రలు సాగవు
- అక్రమ అరెస్టులపై నల్లబ్యాడ్జీలతో నిరసన
- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సారంగపాణి ధ్వజం



**కాకతీయ, నల్లబెల్లి:** బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టులను నిరసిస్తూ సోమవారం నల్లబెల్లి మండల కేంద్రంలో ఆ పార్టీ శ్రేణులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సారంగపాణి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం ద్వారా ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని విమర్శించారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడం నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. ప్రజాప్రతినిధులపై పోలీసు చర్యలకు పాల్పడటం రాజకీయ కక్షసాధింపు చర్యేనని ఆరోపించారు. ప్రభుత్వాన్ని నిలదీయడం ప్రతిపక్షాల హక్కు, బాధ్యత అని పేర్కొన్నారు. నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని, ప్రజల గొంతును నొక్కితే మరింత బలంగా వినిపిస్తుందని అన్నారు. కక్షసాధింపు రాజకీయాలు విడనాడి ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేల అరెస్టులపై నిరసనలు కొనసాగిస్తామని, అవసరమైతే ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సారంగపాణి స్పష్టం చేశారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ అసత్య ఆరోపణలు

- పదేళ్ల పాలనలో ములుగు జిల్లాలో అభివృద్ధి శూన్యం
- కాంగ్రెస్ హయాంలో వందల కోట్లతో అభివృద్ధి పనులు
- యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గంటా కృష్ణారెడ్డి విమర్శ



**కాకతీయ, ఏటూరునాగారం రూరల్ :** గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ములుగు జిల్లాకు జరిగిన అభివృద్ధి శూన్యమని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గంటా కృష్ణారెడ్డి విమర్శించారు. జిల్లా ఏర్పాటు చేశామని చెప్పుకోవడం తప్ప ఆశించిన స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టలేదని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ములుగు జిల్లాలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అభివృద్ధితో బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందనే భయంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గత, ప్రస్తుత పాలనలో జరుగుతున్న అభివృద్ధిని ములుగు జిల్లా ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెబుతారని గంటా కృష్ణారెడ్డి అన్నారు.

# ఎంపీడీవో కృష్ణవేణికి బీఆర్ఎస్ నేతల వినతి

**ప్రభుత్వ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్**




**కాకతీయ, గీసుగొండ:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. మహిళలు, రైతులు, యువత, పేదలు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి హామీల అమలుకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవోను కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పోలీసు ధర్మారావు, బీఆర్ఎస్ నాయకులు చల్లా వేణుగోపాల్‌రెడ్డి, ఫోన్లు జయపాల్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, గుర్రం రఘు, ముంత రాజయ్య, బోడకుంట్ల ప్రకాష్, నమిండ్ల రాజు, శ్రీను, ధనుంజయ్, నరేష్, చిరంజీవి, యూత్ అధ్యక్షుడు శిరీషే శ్రీకాంత్, కోట ప్రమోద్, లెనిన్ అభిషేక్, అభి, రాజీవ్‌గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయాలి

- గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాలతో బీఆర్ ఎస్ నేతల వినతి



**కాకతీయ, పెద్దవంగర :** మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు పెద్దవంగర మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు క్షీణించాయని, ఆరు గ్యారంటీల్లో కోతలు విధించడంతో పాటు రుణమాఫీ, కల్యాణలక్ష్మి పథకాలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266